# పరిశోధనాంశము : సాహితీ సౌరభాలు – సామజిక పద్యసుమాలు – శతక విశ్లేషణ

## TOPIC : SAHITEE SOURABHAALU – SAMAJIKA PADYA SUMALU – SOCIAL ASPECTS

Scholar Name : MENGARAM VENUGOPAL SHARMA , Asst. Prof. of Telugu, Govt. Degree College, Medak
Guide Name : Dr.M.Devendra ,Asst.Prof. of Telugu, Chakali Ailamma Womens University , Hyderabad.
Bharateeya Enginnering Science and Techolonogy Innovation University
Satya Sai District, Andhra Pradesh.

---

**ఉపోద్ఘాతం** : కవి సమాజ దార్శనికుడు. తన కలం చేత ఏది రాసినా , అది సమాజానికి మేలు కలిగించేలా ఉండాలని పరితపిస్తాడు. అందుకోసం ప్రాచీన కాలం నుండి నేటిదాకా విస్తరించిన ఏ సాహిత్యము అయినా అది సమాజాన్ని ప్రతిబింబించ కుండా వదలదు. ఆధునిక కాలం లోనూ ఈ ఒరవడి మరింత విస్తృతమై, విశాలమై నిరంతరంగా కొనసాగుతున్నది. ఇందుకు నిదర్శనమే ఎనిశెట్టి గంగాప్రసాద్ రచించిన సామజిక పద్యసుమాలు అను శతక రచన . ఈ శతకములో ఉన్న పద్య ఖండికలన్నీ సామాజిక స్పృహతో సమ్మిళితమైనాయి. సంఘ జీవితంలో ఎదురయ్యే అంశాలు, సంఘటనలు, ఎన్నో. అన్నింటిలోనూ జీవిత పరమార్థం ఉంది. ఆ పరమార్థ మే పూవులోని పరిమళం లాగ నలువైపులా సువాసనలు వెదజల్లుతుంది. ఇలాంటి భావనను ప్రకటించడంలో కవి నిజంగా క్రాంతదర్శే. సమాజం యొక్క ఉత్తమ భవిష్యత్తు కోసం బాటలు వేయడానికి కవి ప్రయత్నిస్తాడు. హితం చెపుతాడు, చురకలు వేస్తాడు. అవసరమైతే ఆగ్రహము కూడా ప్రకటిస్తాడు. ఎందుకంటే సమాజాన్ని ప్రేమిస్తాడు కనుక , సంఘాన్ని సంస్కరించడానికి తనవంతుగా ప్రయత్నాన్ని చేస్తాడు. ఈ శతక రచనలో ఉన్న అన్ని పద్యాలు కూడా సమాజము యొక్క శ్రేయస్సును కోరేవి . అందుకనే రచయిత తన శతక రచనకు సామాజిక పద్య సుమాలు పని పేరు పెట్టుకున్నారు. ఈ శతకములో రచయిత సుమారు ఇరవై రెండు శీర్షికల ద్వారా సౌరభాలను సమాజానికి పంచిపెట్టారు. ఈ పరిమళాలను పౌరులందరూ ఎదనిండా నింపుకొని నూతనోత్తేజంతో ముందుకు సాగుమని ప్రభోధించారు. ఈ కవితా సుగంధాలను ఆస్వాదించి, ఆఘ్రాణించి సమాజ అభ్యుదయానికి తనవంతు బాధ్యతను అందించవలసిన బాధ్యత ప్రతీ పౌరునిది అని తెలిపారు.

**పరిశోధనా పద్ధతి** : ఎనిశెట్టి గంగాప్రసాద్ కామారెడ్డి లోని సాయం ప్రాచ్య కళాశాలలో విద్యను అభ్యసించి నిజామాబాద్ జిల్లలో ఉపాధ్యాయునిగా పనిచేసి ప్రధానోపాధ్యాయునిగా పదవీ విరమణ చేసిరి. వీరి ప్రవృత్తి కవిత్వ రచన. పద్య రచన. ఎన్నో కవితలు రచించారు. గేయ కవితలు కూడా రచించిరి. ఇంతేకాకుండా శతక రచన కూడా వెలువరించిరి. ఈ శతక రచననే ఈ వ్యాస రచనకు ఉపకరించినది. ఇందులోని పద్యాలన్నీ కూడా సామాజిక కోణంలో వ్రాసినవే. ఇది పూర్తి స్థాయి సామజిక రచనగా ప్రకటించవచ్చు. పర్యావరణము, మానవుల మధ్య ఉండవలసిన మానవీయ విలువలు, వన్య జీవులు , విద్యవంతులు నడుచుకోవలసిన తీరుల, పాలకులకు ఓటరుకు ఉండ వలసిన లక్షణాలు పట్టణీకరణ, వ్యవసాయం, బడుగు జీవులు, ప్రకృతి వనరుల వినియోగము, ప్రభుత్వ సంక్షేమ పథకాలు , మద్య పానము వలన కలిగే సమస్యలు ఇలా ఎన్నెన్నో అంశాలను ఎంచుకొని చక్కగా విశ్లేషించారు . **వినుము మంచి మాట వినిన మేలు** అను మకుటముతో కొనసాగిన ఈ పద్య రచన

1

వీరికి మంచి పేరును తెచ్చిపెట్టింది. మంచి మాటలను వినటం వలన మేలు కలుగుతుంది. ఆచరించడం వలన మరింత శుభం జరుగుతుంది. కనుకనే వీరు ఈ మకుటమును ప్రయోగించిరి. శతక మకుటానికి సామాజిక పద్య సుమాలు-శతకము అను పేరు సార్థకత చేకూరింది. ప్రతీ పద్యము సామజిక ప్రయోజనాన్ని ఆశించిందే..

శతక లక్షణాలు: శతక లక్షణాలను మన ప్రాచీనులు ఇలా పేర్కొన్నారు అవి...

**1.సంఖ్యా నియమము 2) మకుట నియమము 3) వృత్త నియమము 4) రస నియమము 5)**

ఈ నియమాలను రచయిత అనుసరించారు. అయితే సంఖ్యా నియమమును మాత్రం పాటించక 136 పద్యాలు రాశారు. అయితే శతక సాహిత్యములో సంఖ్యా నియమములో 100 నుండి 108 పద్యాల వరకు ప్రాచీనకాలం నుండి నేటి వరకు దాదాపు అందరూ కవులు అనుసరించిరి. కొంతమంది కవులు మాత్రం 300 కు పైగా రాశారు. మరికొంత మంది కవులు 10 8 పద్యాలకు మించి రచించారు. కావున ఇలా ఎక్కువ రాయడం నియమాలను ఉల్లంఘించడముగా భావించవలసిన అవసరము లేదు. ఈ శతకములో ఎనిశెట్టి గంగాప్రసాద్ ఆటవెలదులను ఎన్నుకొన్నారు. అన్ని పద్యాలలో కూడా తన భావాలను చక్కగా ఆవిష్కరించారు.

రచయితకు పర్యావరణము పట్ల ఆసక్తి ఎక్కువ . ఆ మాటకు వస్తే ఎవరికి ఆసక్తి ఉండదు. అందరికీ ఉంటుంది. కాని కవి తన అనుభూతి చేత మరింత భావాన్ని చక్కగా వ్యక్తపరుస్తాడు. ఈ పద్యము చూడండి.

**మొక్క పెంచిచూడు ముదమును గూర్చును,**

**చెట్టు గాలి నీకు జేయు మేలు**

**నీడనోసగి నీకు నెచ్చెలియై యుండు**

**వినుము మంచిమాట వినిన మేలు** ......... అను పద్యంలో మొక్క యొక్క ప్రాధాన్యత తెలిపిరి.ప్రకృతి వలన సమాజానికి కలుగు మేలును తెలిపారు. మొక్కల వలన మానవాళికి స్వచ్ఛమైన గాలి లభించడమే కాకుండా నీడను ఇచ్చి ఎండ నుండి రక్షణ నిస్తుంది. రచయిత ఈ పద్యంలో మొక్కను నెచ్చెలి తో పోల్చాడు. ఒక మంచి చెలిగా పోల్చడములో కొంత వైవిధ్యము కనిపిస్తుంది. అంటే కాకుండా **ఆకుపచ్చ చేలు అలరించుచుండగ / పక్షిజాతులన్ని పరవశించు / హరితహారమనగ హాయిగూర్చునుగదా / వినుము...........మేలు** అను పద్యంలో కూడా ప్రకృతి పట్ల మంచి భావుకత కనిపిస్తుంది. వ్యవసాయ భూములన్నీ కూడా పచ్చగా ఉంటె భూమికి పచ్చని కోక కట్టినట్టు ఉండి మనకు ఆహ్లాదాన్ని కలిగిస్తాయని , పక్షి జాతులన్నీ కూడా కిలకిలా రావాలతో మనకు వీనుల విందును కలిగిస్తాయని అంటారు. హరిత హారము కూడా పర్యావరణాన్ని కాపాడి మనలకు మేలు చేసేది అంటారు.

**వన్యజీవులకికి వనములు కావలె / వనము పెరుగ కురియు వాన, కూర్చు / ముదము రైతు పొందు మోదమ్ము జూడుమా/ వినుము ...... మేలు**. మనుషుల స్వార్థం వలన అడవులు నశిస్తున్నాయని , అడవులలో నివసించే ప్రాణులకు అటవీ

సంపద కావాలని తద్వారా మనకు సకాలంలో వానలు కురుస్తాయని , ఫలితంగా రైతు గుండెలలో ఆనంద సంతోషాలు తాండవముచేస్తాయని అంటారు. ఎప్పుడైతేరైతు గుండెలలో సంతోషము కనిపిస్తుందో అప్పుడు సమాజము కూడా నిలకడగా ఉంటుందని భావిస్తారు రచయిత. దేవులపల్లి కృష్ణశాస్త్రి అన్నట్లు ఆకులో ఆకునై , పూవులో పూవునై , కొమ్మలో కొమ్మనై, నునులేత రెమ్మనై ఈ అడివీ దాగిపోనా ...ఎటులైనా ఇచటనే ఆగిపోనా అనిపించక మానదు. అలౌకిక ఆనందాన్ని ఇచ్చే వనరులను కాదని కేవలం లౌకిక ఆనందం కోసం ప్రకృతిని ధ్వంసం చేయడం సమాజానికి అత్యంత ప్రమాదమని చెబుతారు.

**తప్పు చేయుటేల తప్పించుకోనుటేల / తప్పు గాయు మనెడు తిప్పలేల ? / తప్పు ఎప్పుడైన ముప్పేను ధరలోన / వినుము.......మేలు** (11) ఒక తప్పు మరొక తప్పుకు దారి తీస్తుంది అనేది మన అందరికీ తెలుసు. అసలు తప్పు ఎందుకు చేయాలి. దానిని తప్పించుకొనుటకు మరొక తప్పు చేయాలి. ఎప్పటికైనా తప్పు ముప్పే అనేది అందరికీ తెలుసు. అయినా ఈ లోకం పోకడ చూస్తే, అన్నీ తెలిసినా కూడా తప్పు మీద తప్పు చేస్తూనే ఉన్నారు. ఎలాంటి సంకోచము లేకుండా లంచాలు తీసుకుంటున్నారు, ప్రభుత్వ నిధులను దుర్వినియోగ పరుస్తున్నారు. అసలు సమాజంలో అవినీతికి పాల్పడని రంగము అంటూ ఉందా అని అనిపిస్తుందని ఆవేదన చెందుతారు రచయిత. వీటన్నిటికీ మానవులకు అధికమైన కోరికలు ఉండటమే కాకుండా ఆ కోరికలను ఏవిధంగానైనా సరే తీర్చు కోవాలనే తీరు చాలా పమాదకరమనైనది అని సూచిస్తారు.

**కలిమి లేములేవి కనగరావిసుమంత / పేదసాదలనిన, ప్రేమతోడ / ఆదుకొనెడి వారె ఆర్యులనగవచ్చు / వినుము .... వినిన మేలు.**(12) ఈ పద్యములో నేటి సమాజములో అంతకంతకు అంతరించి పోతున్న మానవీయ విలువలు కనిపిస్తాయి. స్నేహము,ప్రేమ, అనురాగాలు క్రమంగా అంతరించి పోతున్నాయని ఆవేదన చెందుతాడు. పేదల పట్ల, ఆర్తుల పట్ల , దీనులపట్ల ఉదార స్వభావం కలిగి ఉండాలనే ఆలోచన కలిగి ఉండాలని అంటాడు రచయిత. డా.అందెశ్రీ రచించిన మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు, మచ్చుకైనా లేడు మానవత్వం ఉన్నవాడు , నూటికో కోటికో ఒక్కడే ఒక్కడు యాడ ఉన్నడో గాని కంటికీ కనరాడు అను గేయం గుర్తుకు రాకమానదు. మానవత్వపు విలువలు ఎప్పుడైతే బీటలు వారుతాయో ఆ సమాజపు పునాదులు బీటలు వారుతున్నట్టే. అందుకే కష్టాలలో ఉన్నవారిని ఆదుకొన్న వారే నిజమైన రాజులు అనేది సత్యం.

**అలుకబూన బోకు ఆదశిశువనెంచి / కట్టుకున్న భార్య కాన ననకు**
**ఆడదైన నేమి ఆధారమగు నీకు / వినుము ........వినిన మేలు.** (19)
**బ్రతుకు బాటలోన పడతియే మొదటిదౌ / ఎల్లవేళ నీకు ఇంట నుండు**
**హితవరి గాను మసలి ఇల్లు సరిదిద్దు / వినుము ......వినిన మేలు** (20)
**అతివలేని ఇంట ఆనందముండదు / ఏమి ఫలము అందమెంతయైన**
**భూమి లేక విత్తు భూరిగా మొలచునా / వినుము .... వినిన మేలు** (21)

పైన పేర్కొన్న పద్యాలలో ఆడడానికి ఉన్న ప్రశస్తి చక్కగా విశదపరచారు. ఎక్కడ స్త్రీ గౌరవింప బడుతుందో అక్కడ దేవతలు పూజింప బడుదురు అని పెద్దలన్నారు. అది నిత్య సత్య వచనము అని మనము గ్రహించాలంటారు గంగాప్రసాద్ గారు. నేటికినీ సమాజంలో గర్భంలో ఆడ శిశువని తెలిసి తొలగించుకునే వారు కూడా ఉన్నారు. అదీ తప్పే, కట్టుకున్న భార్యను ఎలుకోను అని అనకు అదీ తప్పే, చులకనగా చూసితివా తరువాత ఆ ఆడదే నీకు దిక్కు అవుతుంది. బ్రతుకు పయనంలో నీకు మొదటి అడుగు స్త్రీతోనే మొదలవుతుందని, ఎల్ల వేళలా నీ ఇంటిని సరిదిద్దునని,స్నేహితురాలిగా నిన్ను, నీ ఇంటిని సరిదిద్దునని, స్త్రీ లేని ఇల్లు ఆనందంగా ఉండదని, శోభను కలిగి ఉండదని, ఆడదే ఆధారం , మనిషికి ఆడదే ఆనందం అని, ఇంటికి దీపం ఇల్లాలని స్త్రీ

యొక్క ఔన్నత్యాన్ని కవులు చక్కగా తెలిపారు. అలాంటి ఆడదాన్ని చులకనగా చూడ వద్దని అంటారు. స్త్రీని దైవంగా భావించే మన సంస్కృతిని విడనాడవద్దని సూచిస్తారు. ఇప్పటికీ మన సమాజంలో చిన్న వయసు అయినా కూడా అమ్మాయికి పెద్దలు నమస్కరించే సంస్కారం మన సమాజం లో చూడవచ్చు.

**ఆత్మహత్య లొద్దు ఆత్మబలమె ముద్దు / వాడి మాటలేవి వదలబోకు**

**ఓర్మి మేలు జేయు ఒప్పదల కలుగు / వినుము .... వినిన మేలు ( 27 )**

**మనిషి విద్యనేర్వ మతమను మాటేల / సభ్యతను మరచిన చదు వులేల వినుము**

**సభ్యతను మరచిన చదువు లేల వినుము / వినుము..... వినిన మేలు (32 )**

సమాజంలో మనం గమనిస్తే చిన్న చిన్న సమస్యలకే ఆత్మహత్యలు చేసుకుంటున్నట్టు ప్రతీరోజూ మనం పత్రికలలో చదువుతూనే ఉన్నాము. కృషి ఉంటె మనిషి తప్పక తీరాన్ని చేరతారని, చేరే క్రమంలో చాలా ఓపికగా ప్రతీ సమస్యనూ శ్రద్ధగా గమనించాలని తెలుపుతాడు. ఆత్మబలం ఉంటె ఆత్మాహత్యలు దరికిరావని , అది మంచి ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుందని ఉత్తేజపరచుతాడు. నేడు సమాజంలో ఉన్న గొప్ప వారిని గమనించి నట్టయితే వాళ్ళందరూ కూడా ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొన్నవారే. ఊరికే విజయం రాదు, ఊరికే సంపదలు రావు. దానికి కావలసిన ఆత్మవిశ్వాసము, ప్రయత్నమూ, చొరవ, ఓపిక , నిరంతర సాధన అవసరము అని అంటారు. గొప్ప గొప్ప చదువులు చదివి కుల మతాల గురించి ఆలోచిస్తూ సభ్యత సంస్కారం మరచి ప్రవర్తించడం చాలా నేరమని అంటారు రచయిత. ప్రముఖ శతక కర్త మారన చెప్పిన పద్యము ఈ సందర్భంగా గుర్తు చేసుకోవచ్చు. **“చదువది యెంత గల్గిన రసజ్ఞత ఇంచుక లేకున్నచాలకున్న , ఆ చదువు నిరర్థకం గుణ సంయుతులెవ్వరు మెచ్చరు ఎచటన్”** అను పద్యం మన అందరం చిన్నప్పడు చడువుకొన్నదే . ఎంత గొప్ప చదువులు చదువుకొన్నా గాని వివేకము గాని రసజ్ఞత గాని లేకపోతె అటువంటి వ్యక్తులను ఈ సమాజం అంగీకరించదు. ఒకవేళ చదువుకున్న వాళ్ళమని విర్రవీగితే తప్పగా ప్రవర్తిస్తే చదువుకున్న వాళ్ళ కన్నా చాకలి వాడు మేలు అనే సామెత నిజమవుతుంది. ఇక్కడ చాకలిని కించపరచడము కాదు . ప్రవర్తన సరిగ్గా లేకుంటే ఇలాగే అంటారు.

ప్రభుత గూల్చనెంచి పథకమ్ము వేయగ / ప్రజల కెవ్విధంబు ఫలము గలుగు /

పదవి కాంక్ష కొరకు పథకాలు గూర్చకు / వినుము మంచిమాట వినిన మేలు . (39)

ఆసరా పథకము ఆనందమును బెంచె / పేదవారి కేమొ పెన్నిదాయె

అర్హులైన వారి కందిన మేలది / వినుము.... వినిన మేలు . (59)

అలవి గాని పెద్ద హామీలు ఏలకో / ఉచితమంటు భ్ర మలముంచుటేల

ఆసరాలు మనకు అభివృద్ధి నిచ్చునా/ వినుము .... వినిన మేలు (75)

పాపకార్యమెల్ల భారమే ధరణికి / దీనజనుల వెతలు దీర్చకున్న

చిట్టచివరిదాక చెంతనుండరెవరు / వినుము ..... వినిన మేలు (79)

శతక పద్యాల యొక్క లక్షణము ఏమిటంటే ఏ కాలంలో చదువుకొన్నా గాని ఆ కాలానికి దగ్గట్టుగా నిత్యనూతనంగా ఉంటాయి. ఎన్ని కాలాలు మారినా , ఎన్ని తరాలు మారినా కూడా ఎప్పడూ కొత్తదనమే కనిపిస్తుంది. నేటి క్షుద్ర రాజకీయాలు ఏ విధంగా దిగాజారుతున్నాయో మనం చూస్తూనే ఉన్నాము. ప్రభుత్వాన్ని కూల్చడానికి ఎన్ని రకాలుగా పథకాలు వేస్తారో

చూడవచ్చు. పదవీకాంక్ష కొరకో,ప్రతీకారం కొరకో రాజకీయాల అస్తిత్వాన్ని కాపాడుకోడానికి పథకాలను ప్రవేశపెట్టవద్దు. ఇందుకు ఉదాహరణగా మన ఉభయ తెలుగు రాష్ట్రాలలో ప్రవేశ పెట్టిన ఉచిత పథకాలను అవలోకన చేసుకోవచ్చు. పూర్తిగా ఉచితం వలన ప్రజలు సోమరులు అవుతున్నారు. పాలకులు బ్రతకడానికి దారిని చూపి సంపద సృష్టించే మార్గాన్ని నిర్దేశించాలి గాని ఉన్న చోటే అన్నీ సమకూరిస్తే ప్రజలు పనిచేయడం మానేస్తారని ఎన్నో నివేదికలు, పత్రికలూ, డిబేట్ లు ఘోషిస్తున్నాయి. ఇలాంటి అంశాలని కూడా కవులు శతక రచనల ద్వారా విశ్లేశించిరి. పాలకులు అందించిన పథకాలు నిజంగా పేదలకు అందాలి అప్పుడే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సార్థకత చేకూరుతుంది. ఆకలి అయిన వాడికి ఆహారం కావాలి గాని ఆయాసము అయ్యే వానికి తిండి ఎందుకు. ఇలాంటి విషయాలను శతక సాహిత్యము చక్కగా విశ్లేషిస్తుంది.

పాపపు పనులెపుడూ చేటునే చేస్తుందని , అది దీన జనులను ఎప్పుడూ ఒడ్డుకు ఒడ్డుకు చేర్చదని , అంతిమంగా నిజానిదే గెలుపని , దానిని గమనించాలని , నీవు చెడ్డ వాడవని తెలిసన రోజ నీ చెంత చెప్పకోడానికి ఎవరూ ఉండరని రచయిత తనకు గల సామాజిక బాధ్యతను శతక రచన ద్వారా వ్యక్తపరచిరి.

**ముగింపు** : వ్యక్తి శ్రేయస్సు గొప్పదా , సంఘ శ్రేయస్సు గొప్పదా అనే ప్రశ్న ఉదయించినపుడు ఖచ్చితంగా సంఘమే గొప్పదనవచ్చు అనడంలో ఎలాంటి సందేహము అవసరము లేదు. అలాంటి సందేశాన్ని ఇచ్చే ప్రాచీన ప్రక్రియ అయిన శతకము ఎన్నెన్నో తరాలకు మేలు చేసినదని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. శతకాలు నీతిని, భక్తిని, శృంగారాన్ని, దేశభక్తిని, జ్ఞాన, వైరాగ్యాలను ఏంతో వైవిధ్యంతో ప్రకటించాయి. శతకాలు నీతిని ప్రకటించడంలో ఏ ప్రక్రియ కూడా ఇంతటి ఆదరణ పొందలేదు. శతాబ్దాలుగా నాటినుండి నేటి వరకు ఆబాలగోపాలాన్ని అలరించాయి. అలరిస్తున్నాయి. అలరిస్తాయి కూడా. అలాంటి ఈ ప్రక్రియలో రచయిత ఎనిశెట్టి గంగాప్రసాద్ గారు వివిధ అంశాలను ఎంచుకొని శతక ప్రక్రియను ఎంచుకొని ఉమ్మడి నిజామాబాద్ జిల్లా శతక సాహిత్యానికి మార్గనిర్దేశము చేసిన ప్రముఖులలో ఒకరుగా నిలిచారు.

**పత్ర సమర్పకులు**

మెంగారం వేణుగోపాల్ శర్మ , తెలుగు అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మెదక్ , 90325 28684

2023WPTEL002, Ph.D. (Telugu ), 2023wptel002@bestiu.edu.in

**పర్యవేక్షకులు ( Ph.D. Guide )** :

డా.ఎం.దేవేంద్ర , అసిస్టెంట్ ప్రొఫెసర్, చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయము ,హైదరాబాద్.

***

5